క్లుప్తంగా

జేఈఓగా ఇందిరానగర్ యువకుడు


మహ్మద్ ఆసిఫ్

ఇల్లెందు: తండ్రి పని చేస్తున్న సింగరేణి సంస్థలోనే ఓ యువకుడు అధికారిగా ఉద్యోగం సాధించాడు. చిన్నప్పటి నుంచి సింగరేణి పనితీరుపై అవగాహన ఉన్న యువకుడు సంస్థలో ఉద్యోగం సాధించి కల నెరవేర్చుకున్నాడు. ఇల్లెందు ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ కరీం జేకే సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన రెండో కుమారుడు ఆసిఫ్ ఇంటర్ వరకు ఇల్లెందులో, డిగ్రీ విజయవాడలో పూర్తి చేశాక ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కూడా చదివి ఖమ్మం కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. అయినా ఆయన సింగరేణిలో ఉద్యోగంపై ఆశలు వదులుకోలేదు. ఈ ఏడాది జనవరిలో జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్(జేఈఓ) పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా పరీక్ష రాయడంతో తాజాగా ఆసిఫ్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సోమవారం విధుల్లో చేరిన ఆయనను ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డీవీ తదితరులు అభినందించారు.

మోడల్ మార్కెట్ కిరాయి ఖరారు

ఇల్లెందు: ఎట్టకేలకు ఇల్లెందు మోడల్ మార్కెట్ కిరాయి ఖరారైంది. సోమవారం మున్సిపల్ పాలక వర్గం సమావేశం ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఆరు తీర్మానాలపై చర్చించి ఆమోదించారు. మోడల్ మార్కెట్ గదులు కింది వరుసలో ఒక్కో గదికి రూ.2,000, పైఅంతస్తులో గది ఒక్కంటికి రూ.1,500 నిర్ణయించారు. లలిత కళామందిర్ రోడ్ కాంప్లెక్స్ టెండర్ ప్రకారం కిరాయికి ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతికి మౌనం పాటించారు. కమిషనర్ శ్రీకాంత్, అంకుషావలీ, డీఈ మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా 247 మంది దరఖాస్తు

పాల్వంచరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుల వేసేందుకు 247 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ వివేక్ సోమవారం తెలిపారు. మొదట ఓటర్ నమోదులో మండలంలో 233 మంది దరఖాస్తు చేసుకోగా, గత నెల 23 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించగా 14 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

ఘనంగా రజకుల ఆత్మీయ సమ్మేళనం

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ గ్రామానికి చెందిన రజకుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. వినోభానగర్ గ్రామ సమీపంలోని మెగా పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తుపాకుల ఎలగొండయ్య, ముదిగొండ రాంబాబు, ముదిగొండ కోటేశ్వరరావు, ముదిగొండ రమేశ్, సిరికొండ పెద్ద నరసింహారావు, తంబారపు శ్రీను, సిరికొండ సుభాకర్, తంబాకు వేణు, సిరికొండ నరసింహారావు, తిరుమల్‌రావు, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి..

కొత్తగూడెంరూరల్: సేవాలాల్ బంజర సంఘం 10వ వార్షికోత్సవ మహాసభ హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 22వ తేదీన ఉందని, దీనిని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు లావుడ్యా ప్రసాద్‌నాయక్ కోరారు. లక్ష్మీదేవిపల్లిలోని మార్కెట్ యార్డులో సోమవారం మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నూనావత్ రాంబాబు, బోడా శ్రీనివాసనాయక్, రవి, శివ, సురేశ్, రవికుమార్, గణేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్

టేకులపల్లి: గ్రామస్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ అజ్మీర జగన్‌నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో క్రీడా పోటీలు జరిగాయని, 10, 11, 12 తేదీల్లో మండలస్థాయిలో క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు.

ముందస్తు అరెస్టులు

ఇల్లెందు: చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న సీఎస్‌పీ పంచాయతీ మాజీ సర్పంచ్ భూక్యా రవిబాబును ముందస్తు అరెస్టు చేశారు. గ్రామపంచాయతీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమం తలపెట్టారు. ఆశా కార్యకర్తలు విమలాదేవి, లత, సునీతను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

మైనార్టీ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శిగా అలీ

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాల్వంచకు చెందిన మొహమ్మద్ ముంతాజ్ అలీ నియామకమయ్యారు. సోమవారం రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ రాజాసాహెబ్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ముంతాజ్ అలీ ప్రస్తుతం టేకులపల్లి జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్నారు.

విక్రయం.. విలాపం..

కేంద్రం దూరమై...
విక్రయం భారమై..

- నాణ్యత నిబంధనలతో రైతుల ఇక్కట్లు
- ధర తగ్గినా దళారులకే పత్తి విక్రయం
- స్థానిక కొనుగోళ్లతో రైతుకు కొంతైనా మేలు


వాహనంలోకి పత్తి లోడ్ చేస్తున్న హమాలీలు

ఇల్లెందురూరల్: ప్రతీ సీజన్‌లో మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యం లేక దళారుల చేతిలో రైతులు మోసపోతూనే ఉన్నారు. పెరిగిన రవాణా, హమాలీ ఖర్చులు తట్టుకోలేక స్వగ్రామంలోనే మద్దతు ధర కంటే తక్కువకే పంటను దళారుల చేతికి అందిస్తున్నారు. ఫలితంగా మొక్కజొన్న, వరి, పత్తి పంట ఏదైనా రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. కనీసం స్థానికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతుకు హమాలీ, రవాణా ఖర్చులు మిగులుతాయి. దీంతో ఉన్న ఊరిలోనే విక్రయించి కనీసం మద్దతు ధరనైనా సొంతం చేసుకునే అవకాశమున్నందున పాలకులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

40 వేల ఎకరాల్లో పత్తి సాగు

ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం 40 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. అనధికారంగా అంటే పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని మరో 5 వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరానికి సుమారుగా ఎనిమిది క్వింటాళ్లు పండినా 40 వేల ఎకరాల విస్తీర్ణంలో సుమారుగా 3.20 లక్షల క్వింటాళ్ల పత్తి ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో పండుతోంది.

క్రమంగా తగ్గుతున్న మద్దతు ధర

ఈ ఏడాది సీసీఐ కేంద్రం ఏర్పాటు చేసిన నాటి నుంచి రూ.7,520 మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేశారు. కానీ గడిచిన పక్షం రోజులుగా ధరపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వారం కిందట మద్దతు ధర రూ.7,475కి పడిపోగా ప్రస్తుతం రూ.7,420కి తగ్గింది. ఈ ప్రభావం గ్రామాల్లో దళారులు చేపట్టే కొనుగోళ్లపైనా పడుతోంది. దీంతో ఇంకొన్ని రోజులు ఆగితే మరింత ధర తగ్గుతుందన్న ఆందోళనతో రైతులు నాణ్యతా ప్రమాణాలు పక్కన పెట్టి విక్రయించక తప్పడం లేదు.

దూరంగా సీసీఐ కేంద్రం

ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న మండలాలకు సంబంధించి కారేపల్లి జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడకు వెళ్లాలంటే ఇల్లెందు మండలం శివారు గ్రామం నుంచి 40 కి.మీ., టేకులపల్లి మండలం శివారు గ్రామం నుంచి 60 కి.మీ. ప్రయాణించక తప్పదు. ఇది రైతులకు అదనపు భారంగా పరిణమించింది. ఎక్కడా లేని విధంగా ఏజెన్సీ గ్రామాల్లో హమాలీ చార్జీలు ఉండటం మరో సమస్యగా మారింది. పత్తిని బస్తాలలో నింపి వాహనంలో రవాణా చేయడం, లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ ఖర్చులు వెరసి క్వింటాకు అదనంగా రూ.450 వరకు భరించక తప్పడం లేదు. ఇక రవాణా కలిపితే రూ.500 వెచ్చించాల్సిందే. ఇలా క్వింటాకు 500 చొప్పున వెచ్చించి కారేపల్లి వరకు తీసుకెళ్లలేక చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యాన అదనపు ఖర్చులు భరించలేక మద్దతు ధర దక్కకున్నా స్థానికంగా ఉన్న దళారులకే తమ ఉత్పత్తులను విక్రయించేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

సౌకర్యాలు అందుబాటులో ఉన్నా..

ఇల్లెందులో సువిశాలమైన స్థలంలో వ్యవసాయ మార్కెట్ నిర్మించారు. పత్తి కొనుగోలుకు అనువుగా నిర్మాణాలు, కొనుగోలు చేసిన సరుకును భద్రపర్చేందుకు వీలైనన్ని గోదాములు ఇక్కడ ఉన్నాయి. అయినప్పటికీ రైతుకు దూరభారం తగ్గించేలా నియోజకవర్గ కేంద్రంలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై అధికారులు ఆలోచన చేయడం లేదు. ఇదిలా ఉండగా సరుకు తీసుకొని కారేపల్లిలోని సీసీఐ కేంద్రానికి వెళ్లినా అక్కడ అధికారులు నిబంధనలు వల్లెవేస్తూ కనీస మద్దతు ధర దక్కనివ్వడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కనీసం ఇల్లెందు మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు వ్యయప్రయాసలు తగ్గి కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉంటుంది.

అదనపు భారం భరించలేక..



వాతావరణం అనుకూలించకున్నా కష్టపడి పత్తి పండించాం. తీరా విక్రయించే సమయంలో ఎప్పటిమాదిరిగా కష్టాలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాన్ని దూరంగా ఏర్పాటు చేశారు. అంత దూరం తీసుకెళ్లలేక మద్దతు ధర రాకున్నా స్థానికంగా విక్రయించుకున్నాం.

–బుచ్చిరాములు, రేపల్లెవాడ, ఇల్లెందు మండలం

నాణ్యత పేరుతో కొర్రీలు..



రవాణా, హమాలీ ఖర్చులు భరించి కొనుగోలు కేంద్రం వరకు పత్తి తీసుకెళితే నాణ్యత, తేమశాతం పేరుతో అక్కడి అధికారులు కొర్రీలు పెడుతున్నారు. దీంతో తిరిగి రాలేక వారు చెప్పిన ధరకే అమ్మాల్సి వస్తోంది. ఇదంతా ఎందుకని ఊరిలోనే విక్రయిస్తేనే మేలు జరుగుతోంది.

–పోషం రాజు, రొంపేడు, ఇల్లెందు మండలం

గిరిజన కాంట్రాక్టర్లతో చేయించండి..


మాట్లాడుతున్న పానిశెట్టి వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: కేటీపీఎస్ యాష్‌పాండ్‌లోని బూడిద నిల్వల తరలింపునకు గిరిజన కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేటీపీఎస్ విద్యుత్ కర్మాగారం నుంచి వృథా బూడిదను యాష్‌పాండ్‌కు తరలించడంతో సూరారం, సోములగూడెం, పునుకుల, పుల్లాయిగూడెం, కరవాగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో మాలోతు ప్రశాంత్, నరేశ్, భట్టు అశోక్, శ్రీకాంత్, రాము, వీరు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుడికి సన్మానం


నవీన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్‌ను సోమవారం జూలూరుపాడులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గెలుపొందడంతో నవీన్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, నాయకులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, కొదుమూరి కోటేశ్వరరావు, పి.నాగరాజు, ఎం.రామకృష్ణ, లకావత్ లచ్చునాయక్, గోపు రామకృష్ణ, వాంకుడోత్ కిషన్‌నాయక్, ధరావత్ ప్రియాంక, రోజా, తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటకు నీరివ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు, పాల్వంచ మండలంలోని చింతల చెరువు ఆయకట్టు రైతులు రెండో పంటను సాగు చేసుకునేందుకు నీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ ఈఈకి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం సూచించారు. రెండో పంటసాగుకు నీరు విడుదల చేయటం ద్వారా రైతులు లబ్ధి పొందుతారని, రైతులు సాగుకు సన్నద్ధం కావాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ వ్యవసాయ రంగంలో రైతులు రాణించాలని ఆకాంక్షించారు.

క్షయ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన


మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రం పరిధి బిల్లుడుతండా, జెండాలతండా, రాకృష్ణాపురం, కొత్తతండాల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వజ్జా పార్వతి, చంద్రకళ, శంకర్, నాగుబండి వెంకటేశ్వర్లు, హారిక, నరేశ్‌నాయక్, కమల, సుజాత, రమేశ్, లోక్యా, అమ్మి, సరోజ, పూర్ణ, నీల, భారతి, వీరమ్మ, తార, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచరూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్యదర్శులు ఎంపీడీఓ బి.నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఐదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆశ కార్యకర్తల అరెస్టు

జూలూరుపాడు: సమస్యల పరిష్కారానికై మంగళవారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా ఆశ కార్యకర్తలను ముందుస్తుగా సోమవారం పోలీసులు అరెస్టు చేశా రు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. అరెస్టయిన వారిలో పూనెం ఝాన్సీ, శారద, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు


కొత్తగూడెంరూరల్: కేక్ కట్ చేస్తున్న నాయకులు


పాల్వంచ: ఫ్లకార్డులు ఆవిష్కరిస్తున్న నాయకులు


ఇల్లెందు: ఆస్పత్రిలో పండ్లు ఇస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్/పాల్వంచ/ఇల్లెందు/జూలూరుపాడు/టేకులపల్లి: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఆస్పత్రుల్లో పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. చుంచుపల్లి మండలంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నాగా సీతారాములు, కంచర్ల చంద్రశేఖర్, ఆళ్ల మురళి, దేవీప్రసన్న, శంకర్‌నాయక్, చింతపుడి రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి.. జిల్లా పార్టీ కార్యాలయంలో జేబీ శౌరి, ఎండీ గౌసుద్దీన్, అల్లాడి నరసింహారావు, అజ్మీర సురేశ్‌నాయక్, సాయి, ఉస్మాన్, గాండ్ల సురేశ్, కొంటె శ్రీను, మహేందర్‌గౌడ్, పాల్వంచలో నూకల రంగారావు, ఎడవల్లి కృష్ణ, కాల్వ భాస్కర్, బద్ది కిశోర్, దొప్పలపూడి సురేశ్, రామునాయక్, ఇల్లెందులో డానియేల్, పులి సైదులు, యదళ్లపల్లి అనసూర్య, గాలిపల్లి స్వరూప, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బొళ్ల సూర్యం, గుడివాడ వీరభద్రం, సుదర్శన్‌కోరీ, మహబూబ్, జూలూరుపాడులో లేళ్ల వెంకటరెడ్డి, మాళోత్ మంగీలాల్‌నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, లకావత్ లచ్చునాయక్, బానోత్ నవీన్, కొదుమూరి కోటేశ్వరరావు, కొలిపాక వెంకటేశ్వర్లు, గోపు రామకృష్ణ, టేకులపల్లిలో కోరం సురేందర్, భూక్య దేవానాయక్, ఇస్లావత్ రెడ్యానాయక్, బాణోతు భద్రు, ఈది గణేశ్, రాసమల్ల నర్సయ్య, రవీందర్‌సింగ్, లక్ష్మయ్య, రవి, గణేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

లీగల్‌సెల్ ఆధ్వర్యంలో..

కొత్తగూడెంఅర్బన్: లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సోనియాగాంధీ జన్మదిన వేడుకల్ల పప్పుల ప్రసాద్, గడదాసు నాగరాజు, నన్నెబోయిన రాంబాబు, ఎన్.గురుమూర్తి, షాజహాన్ పర్వీన్, కాకటి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా



ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఇల్లెందురూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ డిమాండ్ చేస్తూ ఇఫ్టూ అనుబంధ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ధన్‌సింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు నేడు కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని కోరారు. ఈ నెల 13న యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జటంగి వెంకన్న, నరాటి వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, సామేలు, నర్సింహారావు, సుమలత, అరుణ, తిరుపతి, రాధాకృష్ణ, కిశోర్, తాండ్ర కిరణ్, శ్రీను పాల్గొన్నారు.

జీవశాస్త్రం టాలెంట్ టెస్టులో ప్రతిభ


విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

టేకులపల్లి: మండలస్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్టులో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం తెలుగు, ఇంగ్లిష్ మధ్యమాల్లో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ఆంగ్ల మాధ్యమంలో ప్రథమ, ద్వితీయ బహుమతులను స్థానిక జీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎస్.గీత, ఎం.నీరజ్ సాధించారు. తెలుగు మాధ్యమంలో ప్రథమ బహుమతి కుంటల్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బి.సతీశ్, ద్వితీయ బహుమతి సులానగర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఎం.గణేశ్ గెలుపొందారు. విద్యార్థులకు ఎంఈఓ జగన్‌నాయక్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, రంగారావు, శంకర్, వీరన్న, నంద, తావుర్య, స్వరూపరాణి, దీప, యమున, జ్యోతి, పద్మావతి, వెంకటనారాయణ, సుహాసిని పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: బయోలాజికల్ సైన్స్ ఫోరం (టీబీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మండలస్థాయి బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 30 మంది పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన నంద్రు నిశాంత్, జోత్స్న, ఎం.రోహిత, గౌరీ ఈ నెల 18న జరిగే జిల్లాస్థాయి పోటీలకు అర్హత పొందారు.

విపక్షాలను మీరు గౌరవించారా..?

అసెంబ్లీ సమావేశంలో సీపీఐ నేత, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): పదేళ్లు అధికారంలో ఉన్న వారు విపక్షాలను గౌరవించి వారి అభిప్రాయాలను సేకరించారా..? అని ప్రధాన పతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్‌ను సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. శాసనసభలో సోమవారం కూనంనేని మాట్లాడుతూ.. ప్రభుత్వం మారిందని, ప్రస్తుత ప్రభుత్వానికి ప్రత్యేకమైన ఆకాంక్షలు, అభిప్రాయాలు ఉంటాయని, అందుకు అనుగుణంగా పాలన సాగుతుందని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు విపక్షాలను మరిచి ఇప్పుడు విపక్షాలను గౌరవించాలని కోరడమేంటన్నారు. తెలంగాణ సాధనకు సంబంధించి త్యాగం ఏ ఒక్కరి సొత్తు కాదని, తెలంగాణ ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అనేక మంది వారి, వారిస్థాయిలో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. తాను ఏడు రోజులు జైల్లో ఉండి నిరహార దీక్ష చేశానని, 700 కిలోమీటర్లు పాదయాత్ర చేశానని, ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం తనతో నడిచారని, పొన్నం ప్రభాకర్ పార్లమెంట్లో వాదిస్తే, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు పదవులను త్యాగం చేసి ఆందోళన బాట పట్టారన్నారు. తమ కార్మిక సంఘం ఏఐటీయూసీ, ఆర్టీసీ సంఘాలు 45 రోజులు సమ్మె చేశాయని చెప్పారు. అందరి సమష్టి కృషి, త్యాగం ఫలితంగానే తెలంగాణ సిద్ధించిందని కూనంనేని స్పష్టం చేశారు.

'కాంట్రాక్ట్' సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెంలోని టీయూసీఐ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం కార్మికులకు వేతనాలను పెంచేందుకు 75 జీఓను వెంటనే విడుదల చేసి అమలు చేయాలన్నారు. హైపవర్ వేతనాలు చెల్లించాలని, మున్సిపల్ గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఆర్.మధుసూదన్‌రెడ్డి, గందమళ్ల రామయ్య, షేక్ యాకూబ్‌షావలి, గోపాల్‌రావు, పెద్దబోయిన సతీశ్, గుండాల వెంకన్న, చంద్రశేఖర్, నిమ్మల రాంబాబు, వేల్పుల రమేశ్, మల్సూర్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములను తీసుకోవద్దు..


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్/ఇల్లెందు: దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ రవి కుమార్‌కు వారు సోమవారం వినతిపత్రం అందించి మాట్లాడారు. భూమికి సంబంధించి హక్కుదారుగా ఎలాంటి ఆధారాలు లేనంత మాత్రాన స్వాధీనం చేసుకోవాలని యత్నించడం సరికాదన్నారు. సాగు చేసుకుంటున్న కాలపరిమితిని గమనంలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అజ్మీర భావ్‌సింగ్, సిలివేరు సత్యనారాయణ, నబీ, హరికృష్ణ, భూక్య సురేష్, హుస్సేన్, బోడ రమేష్, గుగులోత్ శ్రీను, ధరావత్ రమేశ్, మంగీలాల్, మోతీలాల్, భద్రం, శ్రీదర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సింగరేణిలో భద్రతా పక్షోత్సవాలు


రక్షణ చర్యలు వివరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఈ నెల 9 నుంచి 21 వరకు వార్షిక భద్రతా పక్షోత్సవాలు జరగనున్నాయి. సోమవారం ఇల్లెందు జేకేఓసీ–5లో రక్షణ జెండాను కృష్ణమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేశారు. ప్రతీ రోజు రక్షణ సూత్రాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో గని అదనపు మేనేజర్ శివప్రసాద్, ప్రాజెక్టు ఇంజనీర్ చిన్నయ్య, గుర్తింపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. సింగరేణి ఇల్లెందు ఏరియా 24లో గల ఎంవీటీసీలో రక్షణ పక్షోత్సవాలు జరిగాయి. జీవీ కోటిరెడ్డి, విజయ్‌సింగ్, బి.వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు ఘన నివాళులు


మాట్లాడుతున్న పి.సోమయ్య

ఇల్లెందు: ఎర్ర జెండా నీడన యావత్ కుటుంబాన్ని నడిపిన దేవులపల్లి యాకయ్య నేటితరానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర నాయకులు పి.సోమయ్య కొనియాడారు. శనివారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం డివిజన్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ దేవులపల్లి యాకయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. మచ్చలేని లేని నేతగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశాడని తెలిపారు. మంద నర్సింహారావు, ఎస్‌ఏ నబీ, యాకయ్య సతీమణి సోమలక్ష్మి, ఆలేటి కిరణ్, సంధ్య, సుల్తానా, మోహన్, కృష్ణ పాల్గొన్నారు.